ఆగుతూ.. సాగుతూ..

- నగరంలో ట్రాఫిక్ కష్టాలు
- రోడ్లపై వాహనాల రద్దీ
- ఎక్కడబడితే అక్కడ ట్రాఫిక్ జామ్


లాలాచెరువు - మోరంపూడి రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్ (ఫైల్)

కంబాలచెరువు: చారిత్రక నగరమైన రాజమహేంద్రవరంలో మరో ఏడాదిన్నరలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. మన రాష్ట్రంతో పాటు దేశంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అయితే రాజమహేంద్రవరం ప్రస్తుతం ట్రాఫిక్ చెరలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. ఈ ట్రాఫిక్ చిక్కుముడిని విప్పేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకునైనా అధికారులు ముందే మేల్కొని సమస్యను పరిష్కరించాలని నగరవాసులు కోరుతున్నారు.

విస్తరణకు నోచుకోని రహదారులు

వ్యాపార, వాణిజ్య, ఆధ్యాత్మిక కూడలి అయిన రాజమహేంద్రవరానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా పశ్చిమగోదావరి జిల్లా నుంచి సైతం నిత్యం వివిధ పనులపై లక్షల మంది రాకపోకలు సాగిస్తుంటారు. దీనితో పాటు నగరంలో 8 లక్షలకు పైగా ఉన్న జనాభా ఏదో పనిపై రహదారులపైకి రాక తప్పదు. గత పదేళ్లతో పోల్చితే నగర జనాభా రెట్టింపు అయ్యిందని చెప్పవచ్చు. దీనికి తోడు పెరిగిన ద్విచక్ర వాహనాలు, కారులు, ఆటోలు రహదారి రద్దీకి మరో కారణమవుతున్నాయి. నగరానికి ప్రవేశ ద్వారాలైన ఇటు మల్లయ్యపేట, కాతేరు, అటు దివాన్‌చెరువు, మోరంపూడి, ధవళేశ్వరం, రోడ్డుకం రైల్వే వంతెన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు మరీ అధికంగా ఉంటున్నాయి. నగరంలో 15 ఏళ్ల సంవత్సరాల క్రితం విస్తరించిన రహదారులే ఇప్పటికీ కొనసాగడం ప్రజల దురదృష్టం. తక్షణమే ఈ రహదారులను విస్తరించాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో ఈ ఇబ్బందులు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

6 కిలోమీటర్లకు అరగంటపైనే..

నగరంలో మధ్య భాగమైన గోకవరం బస్టాండ్‌ను కేంద్రంగా తీసుకుంటే ఇటు కాతేరు, మోరంపూడి, మరో పక్క ఐఎల్‌టీడీ జంక్షన్‌కు వెళ్లేందుకు దూరం కేవలం ఆరు కిలోమీటర్లు మాత్రమే. అయితే ప్రయాణ సమయం దాదాపు అరగంట పడుతుంది. అదే దూరాన్ని ఉదయం 6 గంటలకు బయలుదేరితే 10 నిమిషాల్లో చేరుకోవచ్చు. మిగిలిన సమయాల్లో ట్రాఫిక్ కారణంగా విలువైన సమయం వృథా అవుతోంది. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రహదారులు మరింత రద్దీగా మారుతున్నాయి. జాంపేట రోడ్డు, పుష్కర ఘాట్ ప్రాంతం, స్టేడియం, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, ప్రకాశం నగర్ రోడ్లు, దేవీచౌక్, కోటిపల్లి బస్టాండ్, మల్లయ్యపేట, క్వారీ రోడ్డు మరింత రద్దీగా ఉంటాయి.

ఈ చర్యలతో ప్రయోజనం

కాతేరు ఆర్టీసీ బస్టాండ్‌ను కొంతమూరు వైపు మార్చడం ద్వారా నగరంలో బస్సుల రాకపోకలను నియంత్రించవచ్చు. దీనివల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. రహదారి విస్తరణ పనులు చేపట్టాలి. నగరంలో తోపుడు బళ్లు, ప్లాట్‌ఫాం వ్యాపారాలు రద్దీ రహదారుల్లో లేకుండా చర్యలు తీసుకోవాలి. ఆటోలు ఎక్కడిబడితే అక్కడ ఆపకుండా రహదారికి ఇబ్బంది లేని నిర్దిష్ట ప్రదేశాల్లో ఆపేలా చర్యలు తీసుకోవాలి. వ్యాపారాలకు సంబంధించి లోడింగ్, అన్‌లోడింగ్ ఉదయం 8 గంటలలోపు, రాత్రి 9 గంటల తర్వాత మాత్రమే జరిగేలా చర్యలు తీసుకోవాలి.

ఆకుల వీర్రాజుకు పరామర్శ


ఆకుల వీర్రాజును పరామర్శిస్తున్న మోషేన్ రాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజును గురువారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. ఇటీవల వీర్రాజు మాతృమూర్తి ఈశ్వరమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె చిత్రపటానికి మోషేన్ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకుల వీర్రాజు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రముఖ వైద్యుడు పంతం అచ్యుత రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కానుబోయిన సాగర్, యామన రామకృష్ణ గౌడ్, అల్లాడ కృపరాజబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌కు రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వెంకటేశ్వర నగర్ ఏరియా, గోలి రామారావు వీధి, వాకర్స్ పార్క్ రోడ్డు, సత్యవతి హోటల్ రోడ్డు, మహాలక్ష్మి గుడి వీధులు, సుక్షేత్ర అపార్ట్‌మెంట్స్ ఏరియా, విద్యుత్ కాలనీ పరిసర ప్రాంతాలలో సరఫరా ఉండదన్నారు.

సంపద కేంద్రాలను వినియోగించుకోవాలి


పైన గ్రామంలో తడి, పొడి చెత్త విధానంపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై పైన, పెద్దాడ గ్రామాల్లో ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తడి, పొడి చెత్తను క్లాప్ మిత్రాలకు అందివ్వాలన్నారు. బిన్ను బ్యాగ్ పద్ధతిలో వారానికి మూడు సార్లు తడి చెత్త, వారానికి ఒక రోజు పొడి చెత్తను వారు సేకరిస్తారన్నారు. ఆ చెత్తను ఇక్కడకు తీసుకువచ్చి తడి చెత్తను ఎరువుగా, పొడి చెత్తను రీసైకిల్ చేస్తారన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు ఈ కేంద్రానికి తరలించడంతో గ్రామం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు వర్మ, భాను తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమికి కౌలు వేలం

పెదపూడి: చింతపల్లిలోని వీరేశ్వరస్వామి ఆలయ భూమి కౌలుకు గురువారం వేలం పాట నిర్వహించారు. ఆలయ వద్ద జరిగిన ఈ వేలంలో 3.64 ఎకరాలను గ్రామానికి రైతు ఏడాదికి రూ.1.87 లక్షలు చెల్లించేలా, మూడేళ్ల పాటు సాగు చేసుకునేలా పాట దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ వడ్డాది సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో రూ.76 వేలు ఉండగా, ఈసారి రూ.మరో రూ.1.11 లక్షలకు పెరిగిందన్నారు.

కిరాణా పట్టీకి విరాళం

రాజానగరం: గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటి వరకూ కిరాణా పట్టీ బకాయి రూ.65,633 ఉంది. ఈ నేపథ్యంలో గురువారం నీలపాల సుబ్రహ్మణ్యం తన తల్లిదండ్రుల పేరున కిరాణా పట్టీ బకాయిని విరాళంగా చెల్లించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ కాలనీలో ఆక్రమణల తొలగింపు


ఎస్సీ కాలనీ నుంచి మురుగునీరు పోవడానికి ఏర్పాటు చేసిన కాలువ

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని ఎస్సీకాలనీలో పంచాయతీ కార్యదర్శి వెలిచేటి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కాలనీలో ఆక్రమణల కారణంగా వర్షం నీరు, మురుగునీరు బయటకు పోవడానికి అవకాశం లేక ఆ ప్రాంతమంతా ముంపునకు గురవుతోంది. దీంతో జేసీబీ సాయంతో ఆక్రమణలను తొలగించారు. అనంతరం కాలనీ నుంచి పరిమి వారి చెరువు, ఆత్రేడు చెరువులోకి మురుగు నీరు పోవడానికి కాలువ నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్వో దుర్గ, వీఆర్ఏలు సత్తిబాబు, గంగాధర్, వీరబాబు, జూనియర్ సెక్రటరీ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	28 ఇయర్స్ లేటర్
సూర్యమినీ	ఎఫ్–1 దిమూవీ
సూర్యప్యాలెస్	కన్నప్ప
స్వామి	కుబేర
అనుశ్రీ	కన్నప్ప
రాజా	కన్నప్ప
శివజ్యోతి	కుబేర
ఊర్వశి	8 వసంతాలు
మేనక	సింగిల్
రంభ	హౌటు ట్రయిన్ యువర్ డ్రాగన్
అప్సర	కన్నప్ప
అశోక	8 వసంతాలు
నామవరం	
వీఎస్ మహల్	కన్నప్ప
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	కన్నప్ప
కడియం	
వెంకటసూర్య	కన్నప్ప

కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: కోర్టు కేసులపై అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో కౌంటర్ ఫైళ్లు, అప్పీలు దాఖలు చేయాలని అడిషినల్ కమిషనర్, లైజనింగ్ ఆఫీసర్ పీవీ రామలింగేశ్వర్ అన్ని విభాగాల హెచ్‌ఓడీలను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ప్రిన్సిపల్ సెక్రటరీతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌తో అడిషినల్ కమిషనర్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ కోర్టు కేసులకు సంబంధించి అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి కేసులు అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయని, కనుక అధికారులు వారి పరిధిలోని కేసుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేసుల మానిటరింగ్ కోసం ప్రతి విభాగంలోనూ సూపరింటెండెంట్, క్లర్కును ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇకపై ప్రతి గురువారం సమీక్ష జరుగుతుందని, వచ్చే సమావేశానికి శాఖల వారీగా ప్రోగ్రెస్ చూపాలని ఆదేశించారు.

వైభవంగా వారాహీ గుప్త నవరాత్రులు ప్రారంభం


గాడాలలో వారాహీ అమ్మవారు


కడియంలో వారాహీదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

సీటీఆర్ఐ: గాడాల గ్రామంలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో గురువారం వారాహీ అమ్మవారి గుప్త నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి దర్శనానికి రాజమహేంద్రవరం చుట్టు పక్కల నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ మహాలక్ష్మీ అమ్మవారు వారాహీదేవిగా జూలై 10వ తేదీ ఉదయం 9 గంటల వరకూ దర్శనమిస్తారన్నారు. ఈ గుప్త నవరాత్రుల్లో ప్రతిరోజు విశిష్ట పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. పీఠంలో వారాహీ రక్ష తయారు చేస్తున్నామన్నారు. జూలై 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 108 కేజీల గంధంతో మహాభిషేకమాచరించి అమ్మవారి రక్ష ప్రసాదంగా భక్తులకు అందజేస్తామని తెలిపారు.

వారాహీ నవరాత్రులు ప్రారంభం

కడియం: మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబిక మల్లేశ్వరస్వామి ఆలయంలో వారాహీదేవి నవరాత్రులను గురువారం ప్రారంభించారు. ఆలయ అర్చకుడు అప్పలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి



సన్నాహక సమ్మెలో భాగంగా ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: దేశ వ్యాప్తంగా జూలై 9న సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు చేపట్టే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా బ్యాంక్ ఎంప్లాయీస్ కో ఆర్డినేషన్ కమిటీ సెక్రటరీ ఎన్.లక్ష్మీపతిరావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు నగరంలోని యూనియన్ బ్యాంకు కార్యాలయం వద్ద గురువారం సన్నాహక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కార్మిక సమ్మెలో మూడు యూనియన్లకు చెందిన బ్యాంకు ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, బ్యాంక్, ఎల్ఐసీ, ఇన్స్యూరెన్స్‌లను ప్రైవేటుపరం చేయకుండా ఆపాలని, బ్యాంకుల్లో నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ రద్దు చేయాలని, సామాన్య ఖాతాదారులకు సర్వీస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మురళీధర్, శివరామకృష్ణ, స్వాతి, కీర్తన, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దుర్గబాబు

రంగంపేట: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా చేపట్టాలని ఐటీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వావ్ ప్రోగ్రాం స్కూల్ కో ఆర్డినేటర్ పి.దుర్గబాబు పిలుపు నిచ్చారు. స్థానిక ఎస్‌వీఎస్ స్కూల్ ఆవరణలో హెచ్ఎం కేవీవీఎస్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో గురువారం వావ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్‌షిప్ కార్యక్రమంలో పాత పుస్తకాలు, పేపర్లు సేకరించి, దానికి తగిన విద్యా సామగ్రిని అందించారు. ప్రతి ఒక్కరూ రీసైకిలింగ్‌కు సహకరిస్తే చెట్లను కాపాడుకోవచ్చునని ఆయన సూచించారు. అనంతరం వావ్ ప్రోగ్రాంలో స్కూల్ టాపర్‌గా నిలిచి ఇంటర్ స్కూల్ చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకున్న సోహిత జ్ఞానసాయికి ట్రోఫీని, వివిధ తరగతుల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు, పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఏజీఎస్ కో ఆర్డినేటర్ ఎన్.రాముడు ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

మైనార్టీల సమస్యలపై దృష్టి సారించాలి


మాజీ మంత్రి వేణుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అలీ


మాజీ మంత్రి వేణును మర్యాదపూర్వకంగా కలిసిన సత్యప్రియ

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాలు, సమస్యలపై దృష్టి సారించి, వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మీర్జా మౌలా అలీకి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూచించారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ మంత్రిని ఎంఎం అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉప సర్పంచ్ చెరుకూరి సత్యనారాయణ, మైనార్టీ నాయకులు ఇబ్రహీం, షబ్బర్ బాషా, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా నియమితులైన అంగాడి సత్యప్రియ గురువారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణను మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనను మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై దృష్టి సారించి, వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలైతే జీవితం నాశనమే


ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత, అధికారులు


ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత
- ఘనంగా మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం

కంబాలచెరువు: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్ట్స్ కళాశాలలో నావిగేషన్ ఫర్ డ్రగ్ ఫ్రీ ఇండియా 2025 అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ నల్సా స్కీమ్ లో భాగంగా పిల్లలు, విద్యార్థులు, దివ్యాంగులు, వయోవృద్ధులకు సంక్షేమ పథకాలు ఉన్నాయన్నారు. మత్తుకు యువత ఆకర్షితులు కాకుండా నిగ్రహంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా నగర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 వ తరగతి విద్యార్థులకు డ్రగ్స్ వాడకం, కలిగే అనర్థాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగ రాహుల్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ పీవీ సూర్యమోహన్ రావు పాల్గొన్నారు.

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ ఆధ్వర్యంలో ఖైదీలకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎస్.రాహుల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి వ్యక్తులు అనారోగ్యాల బారిన పడి కుటుంబాలకు దూరమవుతున్నారు. ఉప పర్యవేక్షణాధికారి ఎం.రాజకుమార్, కారాగార వైద్యాధికారి పి.కోమల మాట్లాడారు. పోటీల్లో విజేతలైన ఖైదీలకు బహుమతులు అందజేశారు.
- ఆదిత్య బిజినెస్ స్కూల్‌లో ×బ్రేక్ ద సైకిల్ స్టాప్ ద ఆర్గనైజ్ క్రైమ్స్ అనే నినాదంతో ప్రపంచ డ్రగ్ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. దీనికి రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి ఐకాన్స్ చార్టర్ ప్రెసిడెంట్ తీగల రాజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ సమాజంపై బాధ్యతగా ఉండాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులను మరిన్ని నిర్వహించి విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్‌వీ.సుబ్బారావు, కార్యక్రమం కో ఆర్డినేటర్ పి.విజయ్‌దేవన్, అధ్యాపక, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనేక అనర్థాలు

సీటీఆర్ఐ: యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా గురువారం కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ తిరుపణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో మత్తు పదార్థాలు ఉపయోగిస్తే కలిగే అనర్థాలపై కళాశాలలో నషాముక్త్ క్లబ్ ఏర్పాటు చేశామన్నారు. దీని సహాయంతో కేవలం కళాశాలలోనే కాకుండా నగరంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం జరిగిన ర్యాలీలో కలెక్టర్ పి.ప్రశాంతి, మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవకుమారి

- కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, స్త్రీల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మహిళా పోలీస్ స్టేషన్ వుమెన్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కుసుమ కుమారి మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, సామాజిక భద్రతపై మాదక ద్రవ్యాల ప్రభావం ఎంత వినాశకరంగా ఉంటుందన్నారు. స్త్రీల అక్రమ రవాణా అనేది సమాజానికి పట్టిన చీడ అన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు ప్రేరణ కలిగించే అంశాలకు ప్రాధాన్యం

పెదపూడి: పిల్లల మెదడులో ప్రేరణ కలిగించే అంశాలపై తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సంపర సెక్టార్ సూపర్ వైజర్ శ్రీపద్మ అన్నారు. పుట్టకొండ గ్రామంలోని 10వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నవచేతన ప్రాధాన్యతపై కార్యక్రమం నిర్వహించారు. శ్రీపద్మ మాట్లాడుతూ బ్రెయిన్ డెవలప్‌మెంట్ కోసం పిల్లలకు ప్రేరణ ఏ విధంగా ఇవ్వాలో తల్లిదండ్రులకు వివరించారు. మూడేళ్ల లోపు పిల్లలకు 75 శాతం, ఆరేళ్ల లోపు 95 శాతం బ్రెయిన్ డెవలప్‌మెంట్ జరుగుతుందన్నారు. అనంతరం చిన్నారులకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలను గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఐదేళ్లు నిండి ప్రాథమిక పాఠశాలలో చేరిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రీస్కూలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డ్రగ్స్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాడానికి అందరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు దెయ్యాల నారాయణరావు, ఉప సర్పంచ్ మిరియాల శ్రీను, గ్రామ పెద్దలు కేతా శ్రీను, సత్యవతి, మహాలక్ష్మి, కేతా సత్యనారాయణ, ఫణీంద్ర పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్ఎం పార్థసారథి తదితరులు

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు బి.బుల్లెమ్మ, సీహెచ్ఏఎల్ శేషుకుమారి, జి.అనితారాణి, ఎం.సత్యదేవిలను గురువారం ఆ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు వి.పార్థసారథి మాట్లాడుతూ అంకితభావంతో సేవలు అందించి, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో, పాఠశాలను మండలంలో ప్రథమ స్థానంలో నిలపడంలో ఉపాధ్యాయులు అందించిన సేవలు అభినందనీయమన్నారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చార్లెస్, జాకబ్, గణేష్, ఓమి ప్రసాద్, శైల, స్వాతికుమారి, సావిత్రి, రమ్యసుధ, వరలక్ష్మి, భారతి, కామేశ్వరి, సీఆర్ఎంటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లోని ప్రాథమిక తరగతులకు చెందిన విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలు అందజేశారు. వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు హేమంత్ కుమార్, బొబ్బిల్లంక హైస్కూల్ ఉపాధ్యాయిని మాచారమ్మ దంపతులు 25 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోలా సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.